
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

అల్లూరి సీతారామరాజు
జిల్లా వార్తలు
శుక్రవారం 12 జూలై 2024

విశాఖ రేంజ్ డీఐజీగా గోపీనాథ్‌జెట్టి



విశాఖపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): విశాఖ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్(డీఐజీ)గా గోపీనాథ్‌జెట్టిని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం డీఐజీగా పనిచేస్తున్న విశాల్‌గున్నీకి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. 2008 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన గోపీనాథ్‌జెట్టి ప్రస్తుతం గ్రేహౌండ్స్ డీఐజీగా పనిచేస్తున్నారు.

బాబు వరాలు

మూతపడిన మూడు షుగర్ ఫ్యాక్టరీలు తెరిపించే దిశగా చర్యలు

- పోలవరం ఎడమ కాలువ పనులకు రూ.800 కోట్లతో టెండర్లు
- ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు పరుగులు పెట్టిస్తామని హామీ
- ముఖ్యమంత్రి చంద్రబాబు హామీతో అనకాపల్లి జిల్లా వాసుల్లో హర్షాతిరేకాలు



అనకాపల్లి/ఎస్.రాయవరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి):

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనకాపల్లి జిల్లాపై వరాల జల్లు కురిపించారు. జిల్లాలో మూతపడిన తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించి చెరకు రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా గురువారం ఆయన ఎస్.రాయవరం మండలం దార్లపూడిలో పోలవరం ఎడమ ప్రధాన కాలువను పరిశీలించారు.

జిల్లాలో ఎడమ కాలువకు సంబంధించిన 6, 7, 8 ప్యాకేజీ పనుల స్థితిగతులపై ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను చంద్రబాబు తిలకించారు. ఈ సందర్భంగా జలవనరుల శాఖ ఇంజనీర్లకు పలు సూచనలు చేశారు. ఆ తరువాత అక్విడెక్టు వద్దకు చేరుకొని గత ఐదేళ్లుగా ఆగిన పనులను పరిశీలించారు. అనంతరం ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల ఏర్పాటుపై కసరత్తు జరుగుతోందని, సూపర్ సిక్స్ పథకాల అమలు విషయంలో రాజీ పడే ప్రసక్తి లేదని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పోలవరం ఎడమ కాలువ పనులు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం పనులు నిలిచిపోయాయని, ఈ రెండు పథకాలను పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. రూ.800 కోట్ల అంచనాతో త్వరలోనే టెండర్లు పిలిచి పనులు చేపట్టేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని జల వనరుల శాఖాధికారులను ఆదేశించారు. పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తయితే అనకాపల్లి జిల్లాలో లక్ష ఎకరాలకు సాగునీరు అదనంగా అందుతుందని, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం పనులు పూర్తయితే అనకాపల్లి జిల్లాలో మొత్తం 2 లక్షల 80 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. పోలవరం కాలువ, సుజల స్రవంతి పథకానికి అనుసంధానం చేసి జిల్లాకు పోలవరాన్ని ఒక వరంగా మారుస్తామని చంద్రబాబు వ్యాఖ్యానించడంపై జిల్లా ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

సుజల స్రవంతి పథకాన్ని పరుగులు పెట్టిస్తాం

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం పనులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్టు ఉన్నాయని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఈ పనులను ఎన్‌డీఏ ప్రభుత్వం పరుగులు పెట్టించే దిశగా చర్యలు చేపడుతుందన్నారు. సుజల స్రవంతి పథకం పనులు చేపట్టి ఈ ప్రాంత ప్రజలకు సాగు, తాగునీరు అందిస్తామన్నారు. పోలవరం ఎడమ కాలువ పనులతో పాటు ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు పూర్తి చేసి, అనకాపల్లి జిల్లాలో మొత్తం 2 లక్షల 80 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు.



దార్లపూడి వద్ద పోలవరం ఎడమ కాలువ, అక్విడెక్టు స్థితిగతులు తెలుసుకుంటున్న ముఖ్యమంత్రి

షుగర్ ఫ్యాక్టరీల సమస్యకు శాశ్వత పరిష్కారం

జిల్లాలో వైసీపీ ప్రభుత్వ హయాంలో మూతపడిన మూడు షుగర్ ఫ్యాక్టరీల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఎన్‌డీఏ ప్రభుత్వం అడుగులు వేస్తోందని చంద్రబాబు తెలిపారు. షుగర్ ఫ్యాక్టరీలను స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేల సహకారంతో ఇథనాల్ ఉత్పత్తి కేంద్రాలుగా మార్చి చెరకు రైతులకు న్యాయం చేయడమే ఎన్‌డీఏ లక్ష్యమన్నారు.

చంద్రబాబుకు అపూర్వ స్వాగతం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అపూర్వ స్వాగతం లభించింది. మండలంలోని దార్లపూడి వద్ద అసంపూర్తిగా ఉన్న పోలవరం అక్విడెక్టును పరిశీలించడానికి గురువారం 11:35 గంటల సమయానికి చంద్రబాబు చేరుకున్నారు. ఆయనకు శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, మంత్రులు వంగలపూడి అనిత, నిమ్మల రామానాయుడు ... మిగతా 8వ పేజీలో

పీహెచ్‌సీల ప్రతిపాదన పట్టాలెక్కేనా?

రెండేళ్ల క్రితం ఆరు పీహెచ్‌సీలు మంజూరు చేయాలని కలెక్టర్ నివేదికలు

- కనీసం పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- ఇప్పటికే ఏజెన్సీ వ్యాప్తంగా 35 పీహెచ్‌సీలు
- కొత్తవి మంజూరైతే 41కి చేరే అవకాశం
- కూటమి ప్రభుత్వంపై మారుమూల గిరిజనుల ఆశలు



పీహెచ్‌సీ ప్రతిపాదించిన జి.మాడుగుల మండలం మద్దిగరువు

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం గిరిజనాభివృద్ధి, విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తుండడంతో కొత్త పీహెచ్‌సీల ప్రతిపాదనలు కార్యరూపం దాల్చుతాయని గిరిజనులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పాడేరు ఏజెన్సీలో మారుమూల ప్రాంతాల్లో పీహెచ్‌సీలు లేకపోవడంతో గిరిజనులకు వైద్యారోగ్య సేవలు సక్రమంగా అందడం లేదని అధికారులు గుర్తించారు. ఈక్రమంలో కొత్త ఆరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మంజూరు చేస్తే వైద్య సేవలు గిరిజనులకు మరింత చేరువవుతాయని భావించారు. అందులో భాగంగా అవసరమైన సమగ్ర సర్వే చేపట్టి, రాష్ట్ర ప్రభుత్వానికి రెండేళ్ల క్రితమే అప్పటి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

పాడేరు ఏజెన్సీ 11 మండలాల పరిధిలో ఏడు లక్షల మంది గిరిజన జనాభాకు మండల, గ్రామ స్థాయిలో 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. అలాగే జిల్లా కేంద్రం పాడేరులో 200 పడకల జిల్లా ఆస్పత్రి, అరకులోయ, చింతపల్లిలో వంద పడకల ఏరియా ఆస్పత్రులు, ముంచంగిపుట్టులో 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం ఉన్నాయి. అలాగే 35 పీహెచ్‌సీలున్నాయి. అయినప్పటికీ మారుమూల ప్రాంతాల్లో గిరిజనులకు సకాలంలో వైద్య సేవలు అందడం లేదు. ముఖ్యంగా కొయ్యూరు, పెదబయలు, జి.మాడుగుల, హుకుంపేట, పాడేరు మండలాల్లో ఈ పరిస్థితి ఉంది. మండల కేంద్రాలకు 50 నుంచి 60 కిలోమీటర్ల దూరంలో గ్రామాలు ఉండడం, రోడ్డు సదుపాయం లేకపోవడంతో పాటు పీహెచ్‌సీలకు సైతం 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లోని గిరిజనులకు ఎటువంటి అనారోగ్య సమస్య ఏర్పడినా సకాలంలో వైద్య సేవలు అందని పరిస్థితి కొనసాగుతున్నది. దీంతో మన్యంలో మారుమూల ప్రాంతాల్లో మరిన్ని పీహెచ్‌సీలను ఏర్పాటు చేయాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది.

మన్యంలో కొత్తగా మరో ఆరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ రెండేళ్ల క్రితం అప్పటి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ రాష్ట్ర వైద్యారోగ్యశాఖకు ప్రతిపాదనలు పంపారు. ఏజెన్సీలో హుకుంపేట మండలం మజ్జివలస, పెదబయలు మండలం పెదకోడాపల్లి, పాడేరు మండలం డోకులూరు, కొయ్యూరు మండలంలో నడింపాలెం, జి.మాడుగుల మండలంలో మద్దిగరువు, సొలంబం ప్రాంతాల్లో కొత్తగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ కోరారు. మన్యంలో ప్రైవేటు వైద్య సేవలు అందుబాటులో లేకపోవడంతో గిరిజనులు ప్రభుత్వం అందించే వైద్య సేవలపైనే పూర్తిగా ఆధారపడతారు. అందువల్ల ఏజెన్సీలో కొత్త పీహెచ్‌సీల ఏర్పాటు చేస్తే ... మిగతా 8వ పేజీలో

కనుమరుగు కానున్న కృష్ణాదేవిపేట అటవీ రేంజ్

పెదవలస రేంజ్‌లో విలీనం?

- జిల్లాల పునర్విభజన ఫలితం
- అటవీ శాఖ ఉన్నతాధికారుల నిర్ణయం
- విలీనం అనంతరం బీట్‌ల మార్పు



కృష్ణదేవిపేట అటవీ రేంజ్ కార్యాలయం

కొయ్యూరు, జూలై 11: జిల్లాల పునర్విభజనతో చరిత్ర కలిగిన కృష్ణాదేవిపేట అటవీ రేంజ్ ఎత్తివేయాలని అటవీశాఖాధికారులు నిర్ణయించారు. ఈ రేంజ్‌లోని మూడు అటవీ బీట్‌ల పరిధిలో గల 9 వేల హెకార్లు అటవీ ప్రాంతాన్ని పెదవలస రేంజ్‌లో విలీనం చేయనున్నారు. ఇందుకు ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాగా ఉన్నప్పుడు ఏర్పాటు చేసిన అటవీ పరిధిలు జిల్లాల పునర్విభజనతో మారాయి. దీంతో కొన్ని దశాబ్దాల క్రితం కొయ్యూరు, మంప, బంగారమ్మపేట, బాలారం, శరభన్నపాలెం, గొలుగొండ అటవీ బీట్‌లను కలిపి కృష్ణాదేవిపేట రేంజ్‌గా ఏర్పాటు చేసి అటవీ పరిరక్షణ చేశారు. పునర్విభజనతో కృష్ణాదేవిపేట రేంజ్ పరిధిలోని కొయ్యూరు, మంప బీట్‌లు పెదవలస రేంజ్‌కు మారగా.. బాలారం, బంగారమ్మపేట, శరభన్నపాలెం బీట్‌లు కృష్ణాదేవిపేట రేంజ్ పరిధిలో కొనసాగుతున్నాయి. అయితే అనకాపల్లి జిల్లా మైదాన ప్రాంతం కావడంతో కృష్ణాదేవిపేట రేంజ్ పరిధిలోని బాలారం, బంగారమ్మపేట, శరభన్నపాలెం బీట్‌లు ఏజెన్సీ ప్రాంత పరిధిలో ఉండడంతో ఈ మూడు అటవీ బీట్‌ల పరిధిలోని సుమారు 9 వేల హెక్టార్ల అటవీ ప్రాంతాన్ని కృష్ణాదేవిపేట నుంచి తొలగించి, పెదవలస రేంజ్ విలీనం చేయాలని అటవీ శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. వీటినిఇ అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి అటవీ డివిజన్ పరిధిలోకి తీసుకు వచ్చేలా ఇప్పటికే ఉన్నతాధికారుల ఆదేశాలు జారీ చేశారు. వీటిని అనుసరించి డివిజన్ అధికారులు నివేదికలు సిద్ధం చేసినట్టు సమాచారం. ఇలా విలీనం చేస్తే కృష్ణాదేవిపేట అటవీ రేంజ్ పరిధిలో కేవలం గొలుగొండ సెక్షన్‌కు సంబంధించిన చోద్యం బీట్ మాత్రమే ఉంటుంది. దీంతో కృష్ణాదేవిపేటలో రేంజ్ కొనసాగించడం ప్రభుత్వానికి ఖర్చుతో కూడిన పని తప్పితే ఉపయోగం లేదనే అభిప్రాయానికి ఉన్నతాధికారులు వచ్చినట్టు సమాచారం. ఈ విషయమై చింతపల్లి డీఎఫ్‌వో సూర్యనారాయణను సంప్రదించగా.. కృష్ణాదేవిపేట రేంజ్ పరిధిలోని ఏజెన్సీ అటవీ భూభాగాన్ని పెదవలస రేంజ్‌లో విలీనం చేయాలనే ఆలోచన ఉన్నమాట వాస్తవమేనన్నారు. ఇందుకు సంబంధించి చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలు మారినందున పాలన పరమైన ఇబ్బందులు ఉండకూడదనే తలంపుతో ఉన్నతాధికారులు ఆ దిశగా ఆలోచిస్తున్నారని, త్వరలో కృష్ణాదేవిపేట రేంజ్ పరిధిలోని అడవులను చింతపల్లి, పెదవలస రేంజ్‌ల్లో విలీనం చేస్తారన్నారు. అలాగే ఈ విలీనం అనంతరం పలు బీట్‌లను విభజించేలా ఆలోచన ఉందన్నారు. త్వరలో సిబ్బంది నియమకాలు పూర్తి కాగానే శరభన్నపాలెం బీట్‌ను మూడుగా విభజించే ఆలోచన ఉందన్నారు.

కలెక్టర్ సుడిగాలి పర్యటన

మారుమూల గ్రామాల సందర్శన

ఆస్పత్రులు, పాఠశాలల తనిఖీలు


- వాకపల్లిలో తాగునీటి సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు
- మద్దిగరువు సంతలో వస్తువుల నాణ్యత పరిశీలన
- అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని అధికారులకు కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశం



కాలినడకన కిల్లంకోటలో పర్యటిస్తున్న కలెక్టర్

జి.మాడుగుల, జూలై 11:

పాడేరు నూతన కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ గురువారం మండలంలోని సుడిగాలి పర్యటన చేశారు. తొలుత జి.మాడుగుల పీహెచ్‌సీలో రోగుల వార్డు, ల్యాబ్, ప్రసూతి గదులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలోని భవన నిర్మాణాలు వేగవంతంగా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో వైద్యసిబ్బంది కొరత ఉందని వైద్యాధికారులు వివరించారు. అనంతరం సింగర్బ పంచాయతీ బూరుగువీధి పాఠశాలను తనిఖీ చేశారు. అక్కడి నుంచి నుర్మతి పంచాయతీ వాకపల్లి గ్రామాన్ని సందర్శించారు. అక్కడి తాగునీటి సమస్యను స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా.. వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ దినేశ్‌కుమార్ ... మిగతా 8వ పేజీలో



బొయితిలి పాఠశాల విద్యార్థులతో పాఠ్య పుస్తకాలను చదివిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

వరదలపై అప్రమత్తంగా ఉండాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశం

ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించకూడదని సూచన

పాడేరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలోని వరద ముంపు ప్రాంతాల్లోని అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆదేశించారు. జిల్లాలో వరద ముంపు ప్రాంతాల్లోని అధికారులతో గురువారం తన క్యాంప్ కార్యాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. వరదలకు సంబంధించిన సమాచారం ముందుగానే తెలుస్తుందని, ఈ క్రమంలో ముందస్తుగానే వరదలను ఎదుర్కొనేందుకు అవసరమైన చర్యలకు అధికారులు సిద్ధం కావాలన్నారు. అవసరమైన మేన్‌పవర్, బోట్లు, రెస్క్యూ సామగ్రి అందుబాటులో ఉంచుకోవాలని, పునరావాస కేంద్రాలను సిద్ధం చేసుకోవాలన్నారు. అలాగే వరదలను సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజలకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా, ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించడానికి ఆస్కారం లేకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. వరదల ... మిగతా 8వ పేజీలో

ఆశ్రమాల్లో పీవో ఆకస్మిక తనిఖీ

విద్యార్థులతో కలిసి భోజనం


- స్వయంగా వడ్డించిన పీవో అభిషేక్
- సౌకర్యాలు, మెనూ అమలుపై ఆరా



బాలికలతో కలిసి భోజనం చేస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్ , డీడీ కొండలరావు

అరకులోయ, జూలై 11:

ఐటీడీఏ పీవో అభిషేక్ ఆశ్రమ పాఠశాలల్లో సౌకర్యాలు, మెనూ అమలుపై ప్రత్యేక దృష్టి సారించారు. గురువారం రాత్రి జైపూర్ జంక్షన్ వద్ద ఉన్న జీటీడబ్ల్యూఎస్ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను డీడీ కొండలరావుతో కలిసి సందర్శించారు. విద్యార్థుల కోసం సిద్ధం చేసిన భోజనాలను పీవో పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి పీవో, డీడీ భోజనాలు చేశారు. తర్వాత విద్యార్థులతో ముచ్చటించారు. చక్కగా చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకొని విజయాలను సాధించాలన్నారు.



కిల్లోగుడలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న పీవో అభిషేక్

డుంబ్రిగుడలో..

ఆశ్రమ పాఠశాలలో ఐటీడీఏ పీవో అభిషేక్ గురువారం రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. భోజనంతో పాటు సౌకర్యాలపై ఆరా తీశారు. కిల్లోగుడ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలురు బాలికల ఆంగ్ల మాధ్యమ ఆశ్రమ పాఠశాలలో తనిఖీ చేశారు. విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధం చేసిన భోజనాలు పరిశీలించారు. స్వయంగా విద్యార్థులకు వడ్డించారు.

అధిక జనాభాతో అనర్థం

- డీఎంహెచ్‌వో జమీల్ బాషా

· 8లో



ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా పాడేరులో ర్యాలీ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో, వైద్య సిబ్బంది

బొర్రాగుహలకు ముప్పు

- పైనుంచి రెండో ట్రాక్ నిర్మాణానికి రైల్వే సన్నాహాలు
- అన్నీ తెలిసినా పట్టించుకోని పర్యాటక శాఖ అధికారులు

... వివరాలు మెయిన్ 12వ పేజీలో



బొర్రా రైల్వే స్టేషన్ సమీపంలో జరుగుతున్న డబ్లింగ్ పనులు




దార్లపూడి వద్ద పోలవరం ఎడమ కాలువను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

సీఎం పర్యటన సక్సెస్

ఉమ్మడి జిల్లాలో గురువారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన సూపర్ సక్సెస్ అయింది. తొలుత అనకాపల్లి జిలా ఎస్.రాయవరం మండలం దార్లపూడిలో పోలవరం ఎడమ కాలువను అధికారులతో కలిసి పరిశీలించిన ఆయన, అక్కడి నుంచి విజయనగరం జిల్లా భోగాపురం వద్ద నిర్మిస్తున్న విమానాశ్రయాన్ని పరిశీలించేందుకు వెళ్లారు. తిరిగి మధ్యాహ్నం స్టీల్ ప్లాంటు సమీపానున్న మెడ్‌టెక్ జోన్‌కు చేరుకున్నారు. అక్కడ రెండు కొత్త కంపెనీలను ప్రారంభించి, వివిధ రకాల యంత్రాలు, కార్యకలాపాలను తెలుసుకున్నారు. కార్యక్రమం అనంతరం ఎయిర్‌పోర్టుకు చేరుకుని, అక్కడి వీఐపీ లాంజ్‌లో జిల్లా అధికారులతో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు.



దార్లపూడి వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న చంద్రబాబు



ముఖ్యమంత్రి చంద్రబాబుకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు



దార్లపూడి హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఘన స్వాగతం పలుకుతున్న హోం మంత్రి అనిత



ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ..



దార్లపూడి వద్ద అభిమానుల ఉత్సాహం



చంద్రబాబు పర్యటనకు హాజరైన స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యేలు కేఎస్ఎన్ రాజు, కొణతాల రామకృష్ణ, సుందరపు విజయకుమార్



మెడ్‌టెక్ జోన్‌లో నిర్వహించిన పారిశ్రామిక వేత్తల సమావేశంలో చంద్రబాబు



మెడ్‌టెక్ జోన్‌లో కంపెనీని ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు



ఎయిర్‌పోర్టు వీఐపీ లాంజ్‌లో అధికారులతో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



హాజరైన విశాఖ, అనకాపల్లి జిల్లా కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులు



మెడ్‌టెక్ జోన్‌లోని కంపెనీని పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు

క్రైం... crime news

ప్రమాదవశాత్తూ నేలబావిలో పడి రైతు మృతి

కశింకోట, జూలై 11: మండలంలోని పరవాడపాలెంలో నేల బావిలో నీరు తోడేందుకు వెళ్లి రైతు కర్రి రాజు (48) కాలు జారి పడిపోవడంతో మృతి చెందినట్టు ఏఎస్ఐ శంకరరావు తెలిపారు. రోజూ మాదిరిగానే పంట పొలానికి నేలబావి వద్ద నీరు తోడేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిపోయాడు. రాజుకు ఈత రాకపోవడంతో మృతి చెందాడని భార్య పైడమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడుకి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ శంకరరావు తెలిపారు. మృతదేహానికి ఎన్టీఆర్ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గంజాయి కేసులో నిందితుడికి జైలు

చోడవరం, జూలై 11: గంజాయి రవాణా కేసులో పట్టుబడిన నిందితుడికి రెండేళ్ల 7 నెలలు జైలు శిక్ష విధిస్తూ స్థానిక 9వ అదనపు జిల్లా కోర్టు జడ్జి గురువారం తీర్పు ఇచ్చారు. తమిళనాడు చెన్నైకి చెందిన ఆర్.ముగుందన్ 2021వ సంవత్సరం నవంబరు 12న వి.మాడుగుల మండలం డి.సురవరం జంక్షన్ వద్ద గంజాయి ప్యాకెట్లతో వస్తుండగా వి.మాడుగుల ఎస్ఐ తన సిబ్బందితో కలిసి నిందితుడిని అరెస్టు చేసి అతని నుంచి 5 కిలోల గంజాయితో పాటు రూ.10 వేలు నగదు స్వాధీనం చేసుకున్నాడు. ఈ కేసు విచారించిన జిల్లా జడ్జి కె.రత్నకుమార్.. నిందితుడు ముగుందన్‌కు రెండేళ్ల ఏడు నెలల జైలుశిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.వెంకటరావు పోలీసుల తరపున కేసు వాదించారు.

గోదావరిలో దూకి సబ్బవరం వాసి ఆత్మహత్యాయత్నం

» కాపాడిన ఫైర్ కానిస్టేబుల్

కొవ్వూరు, జూలై 11: గోదావరి నదిలో దూకి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తిని కొవ్వూరు ఫైర్ కానిస్టేబుల్ రక్షించాడు. అనకాపల్లి జిల్లా సబ్బవరం గ్రామానికి చెందిన చేబ్రోలు వెంకటరమణమూర్తి 25 రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో నిద్ర లేక జీవితంపై విరక్తి చెందాడు. ఈ క్రమంలో కొవ్వూరు గామన్‌బ్రిడ్జి పైనుంచి ఈ నెల 11వ తేదీ రాత్రి గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న రాత్రి గస్తీ నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఫైర్ సిబ్బందికి సమాచారం అందించాడు. దీంతో అగ్నిమాపక సిబ్బంది స్కూబా డైవ్ మాస్టర్, స్విమ్మింగ్ ట్రైనర్ ఎం.ప్రకాష్‌బాబు రెస్క్యూ బోట్‌తో హుటాహుటిన నదిలోకి వెళ్లి వెంకటరమణమూర్తిని రక్షించి బయటకు తీసుకువచ్చారు. చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. వెంకటరమణమూర్తిని రక్షించిన ప్రకాష్‌బాబును ఫైర్ అధికారి ఏబీఎస్ఎస్ వేణు అభినందించారు.

సాంకేతిక లోపంతో నిలిచిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్

» ప్రత్యామ్నాయ రైలు ఏర్పాటు చేసిన అధికారులు

విశాఖపట్నం, జూలై 11: విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు (20833) గురువారం ఉదయం సాంకేతిక లోపం తలెత్తడంతో స్టేషన్‌లోనే నిలిపివేశారు. ప్రయాణికులు అసహనం వ్యక్తం చేయడంతో డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్‌తోపాటు ఉన్నతాధికారులు స్టేషన్‌కు చేరుకుని ప్రత్యామ్నాయంగా ప్రత్యేక ఏసీ రైలును ఏర్పాటు చేసి, ప్రయాణికులకు ఊరట కలిగించారు. దీంతో ఉదయం 5.45 గంటలకు బయలుదేరాల్సిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ స్థానంలో 14 థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌లతో ప్రత్యేక రైలు ఉదయం ఏడు గంటలకు విశాఖ నుంచి బయలుదేరింది. గురువారం మధ్యాహ్నం సికింద్రాబాద్ నుంచి విశాఖ వచ్చే ప్రయాణికులు కూడా ఈ ప్రత్యామ్నాయ రైలులోనే ప్రయాణించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	97.00
లైవ్ ధర	117.00
విత్ స్కిన్	204.00
స్కిన్ లెస్	214.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

ఆరుగురు విద్యార్థినులకు అస్వస్థత

» వడ్డాది హైస్కూల్‌లో కలకలం

బుచ్చెయ్యపేట, జూలై 11: వడ్డాది జడ్పీ హైస్కూల్‌లో గురువారం పదవ తరగతికి చెందిన ఆరుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఉదయం 10.30 గంటల నుంచి 12 గంటల సమయంలో పదవ తరగతికి చెందిన ఆరుగురు విద్యార్థినులు ఒకరి తరువాత మరొకరు అస్వస్థతకు గురై స్పృహ కోల్పోయారు. దీంతో హైస్కూల్‌లో కలకలం రేగింది. విషయం తెలుసుకున్న ఎంఈవో కాశీ విశ్వేశ్వరరావు హైస్కూల్ కి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. విద్యార్థినుల తల్లిదండ్రులకు సమాచారం అందించి అస్వస్థతకు గురైన విద్యార్థినులను స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. వైద్యాధికారిణి డాక్టర్ మౌనిక వీరికి ప్రాథమిక చికిత్స చేసి అనంతరం మెరుగైన వైద్యం కోసం చోడవరం ప్రభుత్వాస్పత్రికి పంపారు. ప్రస్తుతం వీరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, రక్తహీనత, మానసిక ఒత్తిడి కారణంగా విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని వైద్యులు తెలిపారు. వారి ఆరోగ్యం కుదుట పడడంతో ఇళ్లకు పంపించినట్టు హెచ్ఎం శేషుబాబు తెలిపారు.



చోడవరంలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

27, 28 తేదీల్లో ఎస్ఎఫ్ఐ ప్లీనరీ



ప్లీనరీ పోస్టర్‌ను ఆవిష్కరించిన రామ్మోహన్

అనకాపల్లి టౌన్, జూలై 11: పట్టణంలో ఈనెల 27, 28 తేదీల్లో జరిగే ఎస్ఎఫ్ఐ ప్లీనరీ సమావేశాలు విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. రామ్మోహన్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో జరిగిన సమావేశంలో ప్లీనరీ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. నీట్ ప్రశ్నపత్రం అవకతవకలపై వివిధ రూపాల్లో అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు విద్యార్థులు పోరాడాలని పిలుపునిచ్చారు. అనకాపల్లి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజి ఏర్పాటు చేయాలని, ఇందుకు అవసరమైతే పోరాటం చేస్తామన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి. గీతాకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎం.రమణ, సభ్యులు ఎస్.రమణ, కె.ఆదికేశవ, అభిషేక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రణాళిక

» ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్



విశాఖపట్నం, జూలై 11: సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలకు అనుగుణంగా సంస్థ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు సర్కిళ్ల పరిధిలోని పర్యవేక్షక ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లతో టెలీకాన్ఫరెన్సు నిర్వహించి పలు సూచనలిచ్చామన్నారు. జిల్లాల వారీగా తరచూ ఏర్పడుతున్న అంతరాయాలను గుర్తించేందుకు 33 కేవీ ఫీడర్స్, 11 కేవీ ఫీడర్స్ ఎంపిక చేసుకుని, వాటిని సర్వేచేసి లోపాలను పీఎంఐ సర్వే మొబైల్ యాప్‌లో నమోదు చేస్తారన్నారు. సంస్థ పరిధిలోని ఐదు సర్కిళ్లలో గురువారం ఫీడర్లను సర్వే చేశామన్నారు. సమస్యలను టోల్‌ఫ్రీ నంబరు 1912కు తెలియజేస్తే సకాలంలో పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

పోలవరం కాలువ అలైన్‌మెంట్ మార్చాలి

» ముఖ్యమంత్రికి వంగలి సర్పంచ్ వినతి

సబ్బవరం, జూలై 11: మండలంలోని వంగలి గ్రామం మీదుగా వెళుతున్న పోలవరం (బాబూ జగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి) కాలువ అలైన్‌మెంట్‌ను మార్చాలని ఆ గ్రామ సర్పంచ్ ఆకుల శ్రీహేమ గురువారం అనకాపల్లి జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోలవరం కాలువ తమ గ్రామంలో ఉన్న వ్యవసాయ భూముల్లో నుంచి వెళుతుందని, ఇప్పటికే గ్రామంలో రైతులు సాగు చేసుకుంటున్న భూములు ఇండియన్ మారిటైం వర్సిటీ, పెట్రోవర్సిటీ, స్కిల్ డెవలప్‌మెంట్ వర్సిటీలకు వందలాది ఎకరాలు ప్రభుత్వం సేకరించిందన్నారు. కొద్దిపాటి భూములు మాత్రమే రైతులు సాగు చేసుకునేందుకు మిగిలాయని, ఇప్పుడు ఆ కాస్త భూముల్లో నుంచే పోలవరం కాలువ వెళ్లే తమ గ్రామం ఖాళీ అవుతుందని, రైతులు సాగు చేసుకునేందుకు ఎటువంటి భూములు ఉండవని వినతిపత్రంలో వివరించారు.

రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై ఫిర్యాదు

» ఆటోలో 800 కిలోల బియ్యాన్ని తరలిస్తుండగా అడ్డుకున్న సర్పంచ్

రోలుగుంట, జూలై 11: మండలంలోని పలు గ్రామాల్లో రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. రొంగలిపాలెంలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండడాన్ని స్థానిక యువకులు గుర్తించి సర్పంచ్ లోవరాజుకు తెలియజేశారు. గ్రామానికి చెందిన రొంగలి రమణ అనే కిరాణా వ్యాపారి గురువారం ఉదయం ఆటోలో 800 కేజీల బియ్యాన్ని తరలిస్తుండగా సర్పంచ్ లోవరాజు, తదితరులు గుర్తించి అడ్డుకున్నారు. దీనిపై రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు.

ఇద్దరు ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లపై క్రిమినల్ కేసులు

పాయకరావుపేట, జూలై 11: మండలంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు దుర్వినియోగానికి పాల్పడిన నామవరం, ఈదటం ఫీల్డ్ అసిస్టెంట్లపై క్రిమినల్ కేసులు నమోదుచేయాలని పోలీసులను కోరినట్టు ఎంపీడీఓ కె.స్వప్న తెలిపారు. గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ.. గడచిన ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులు చేపట్టారన్నారు. ఈ పనులపై ఇటీవల సామాజిక తనిఖీ బృందాలు నిర్వహించిన 16వ విడత సోషల్ ఆడిట్‌లో నామవరం ఫీల్డ్ అసిస్టెంట్ రామస్వామి రూ.5,22,900, ఈదటం ఫీల్డ్ అసిస్టెంట్ సోమయ్య రూ.7,06,075 బినామీ మస్తర్లతో పనులు చేయకుండా బిల్లులు కాజేశారని తేలడంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఈ ఇద్దరిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నట్టు ఆమె తెలిపారు.

వామనావతారంలో జగన్నాథస్వామి



వామనావతారంలో జగన్నాథస్వామి

అనకాపల్లి టౌన్, జూలై 11: స్థానిక ఇంద్రజ్యుమ్నా హాల్‌లో కొలువైన సుభద్ర బలభద్ర సమేత జగన్నాథస్వామి గురువారం భక్తులకు వామనావతారంలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఛైర్మన్ దాడి బుజ్జి, ఈవో రాజసులోచన, కమిటీ సభ్యులు చర్యలు చేపట్టారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

మాకవరపాలెం, జూలై 11: మండలంలో పెద్దిపాలెం గ్రామంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపట్టారని, దానిని తొలిగించాలని కలెక్టర్‌కు ఇటీవల గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ మురళీమోహన్‌రావు అక్రమ నిర్మాణం తొలగించాలని ఆక్రమణదారుడిని హెచ్చరించారు. పెద్దిపాలెం గ్రామంలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అధిక జనాభాతో అనర్థం

» డీఎంహెచ్‌వో జమీల్ బాషా



అంబేడ్కర్ కూడలిలో మానవహారం చేపట్టిన వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

పాడేరు రూరల్, జూలై 11 : ప్రపంచంలో జనాభాను తగ్గించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి షేక్ జమీల్ బాషా పిలుపునిచ్చారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎం శిక్షణ కేంద్ర విద్యార్థులు ప్రభుత్వ ఏఎన్ఎం శిక్షణ కేంద్రం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా అంబేడ్కర్ కూడలి వరకు జనాభా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ కూడలిలో మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో జమీల్ బాషా మాట్లాడుతూ.. జనాభా పెరుగుదల వల్ల అనేక సమస్యలు ఎదురవుతాయన్నారు. వనరుల కొరత, ఆరోగ్యపరమైన సవాళ్లు, ఆహార సంక్షోభం వంటి దుష్పరిణామాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మినుములూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి సాయిశ్రీ, వైద్య సిబ్బంది గుల్లెలి సింహాద్రి, వరలక్ష్మి, శెట్టి నాగరాజు, కె.లక్ష్మణరావు, జేవీ.చలం,కృష్ణవేణి, బుజ్జి. నాగరాజు, ఏఎన్ఎం శిక్షణ కేంద్ర ప్యాకల్టీ గణేశ్వరి, సుజాష్న విద్యార్థులు పాల్గొన్నారు.

'సంతల్లో కల్తీ సరకుల విక్రయాలు'



మద్దిగరువు సంతలో నిర్వహిస్తున్న ర్యాలీలో చిట్టిబాబు తదితరులు

జి.మాడుగుల, జూలై 11 : గిరిజన ప్రాంత వారపుసంతల్లో కల్తీ నిత్యావసరాలు విక్రయాలు జరుగుతున్నాయని జిల్లా వినియోగదారుల సంఘం నాయకుడు బి.చిట్టిబాబు ఆరోపించారు. మద్దిగరువు వారపు సంతలో గురువారం ఆ సంఘం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన చట్టాలు కఠినంగా రూపొందించారని, అసాంఘిక కార్యకలపాలకు దూరంగా ఉండాలని గిరిజనులకు సూచించారు. అలాగే నాణ్యమైన వస్తువులు కొనుగోళ్లు చేయాలని, రూ.100లు పైన కొనుగోళ్లు చేసిన ఏ వస్తువుకైనా రశీదు పొందాలన్నారు. వారపు సంతలో వివిధ వస్తువులపై పరిశీలించారు. కుళ్లిన కోడిమాంసం విక్రయిస్తుండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్తీ వస్తువులపై అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పి.చిట్టిబాబు, తిరుపతిరావు, మాలంనాయుడు, శ్రీను, కేశవరావు, బాలన్న, మోహన్, లక్ష్మణ్‌రావు, సన్యాసిరావు, రాజ్‌కుమార్, నాగేశ్వరరావు,నీలందొర పాల్గొన్నారు.

సీఎం వస్తే.. మాకెందుకు గృహ నిర్బంధం?

» గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు అప్పలనర్స

పాడేరు రూరల్, జూలై 11 : ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖపట్నం పర్యటనకు వస్తున్నారని అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో నివాసం ఉంటున్న ఆదివాసీ నాయకులను గృహ నిర్బందం చేయడం అన్యాయమని గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స అన్నారు. సీఎం విశాఖ పర్యటన దృష్టిలో పెట్టుకొని తనతో పాటు గిరిజన సంఘం జిల్లా నాయకులు



అప్పలనర్స ఇంటి వద్ద కాపాలా ఉన్న పోలీసులు

వంతాల దాస్ ఇంటి వద్దకు గురువారం ఉదయాన్నే మఫ్టీలో చేరుకున్న పోలీసులు తమను బయటకు వెళ్లకుండా గృహ నిర్బందానికి పాల్పడ్డారన్నారు. నాటి వైసీపీ, నేటి టీడీపీ ప్రభుత్వాల తీరుకు వ్యత్యాసం ఏముందని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు తీరు మారాలని, ఎన్నికల్లో గిరిజన ప్రాంత ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఆదివాసీ ఉద్యమ నాయకులను సంఘవిద్రోహ శక్తుల్లా చూడటం మానుకోవాలనిఆయన అన్నారు.

పెళ్లి పేరుతో మోసంపై యువతి ఫిర్యాదు

గుంతకల్లు టౌన్, జూలై 11 : అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన ఓ వ్యక్తి పెళ్లి చేసుకుంటానని చెప్పి తనను మోసగించాడని బాధితురాలు కసాపురం పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేసింది. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరుకు చెందిన నందినికి గుంతకల్లు పట్టణంలోని ఓ పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్న స్వామి పొరపాటున ఫోన్ చేశాడు. రాంగ్ నంబర్ ద్వారా వారి మధ్య పరిచయం ఏర్పడింది. ఐదేళ్ల నుంచి ఇద్దరం ఫోన్‌లో మాట్లాడుకుంటున్నామని ఆమె తెలిపింది. తనను పెళ్లి చేసుకోవాలని అడిగానని, దీంతో తనను మంగళవారం కర్నూలుకు పిలిపించాడని తెలిపింది. అక్కడి నుంచి గుంతకల్లు పట్టణంలోని సత్యనారాయణపేటలోని ఓ ఇంటికి బుధవారం తీసుకువచ్చాడని, రోజంతా అక్కడే ఉంచాడని పేర్కొంది. ఆ తరువాత తనకు ఇదివరకే పెళ్లి అయిందని, పిల్లలు ఉన్నారని చెప్పాడని, తనను తిరిగి పాడేరుకు వెళ్లిపోవాలని సూచించాడని వాపోయింది. తాను తిరిగి వెళ్లనని చెప్పానని, దీంతో తినడానికి ఏమైనా తెస్తానని చెప్పి వెళ్లిపోయి.. తిరిగి రాలేదని పోలీసులకు వివరించింది. తాను మోసపోయానని, న్యాయం చేయాలని పోలీసులకు విన్నవించింది.

అంకితభావంతో పని చేయాలి

కొయ్యూరు, జూలై 11 : ప్రభుత్వ ఉద్యోగులు తమకు నిర్దేశించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహించిననాడే ఉత్తమ అధికారులుగా గుర్తింపు లభిస్తుందని విశాఖపట్నంకు చెందిన విశ్రాంత సీఈవో సీహెచ్ వెంకటరావు సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది విధుల్లో అనుసరించాల్సిన తీరుపై ఎంపీడీవో సీతయ్య ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉత్తమ ఉద్యోగిగా 15 పర్యాయాలు ఉత్తమ సేవా పురస్కారాలు తీసుకున్న విశ్రాంత సీఈవో వెంకటరావుతో పాటు, అనంతగిరి, చింతపల్లి మండల పరిషత్ కార్యాలయ ఏవోలు లక్ష్మినారాయణ, రవీంద్రలు పాల్గొని పంచాయతీలలో కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ప్రజలతో వ్యవహరించాల్సిన తీరుపై వివరించారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా ప్రజలకు చేరవేయాలన్నారు.

వరదలపై అప్రమత్తంగా ఉండాలి

... 5వ పేజీ తరువాయి

ప్రభావానికి రోడ్లు పాడై గ్రామాల మధ్య సంబంధాలు తెగే పరిస్థితులను ముందుగానే గుర్తించి, ఆయా గ్రామాలను అనుసంధానం చేసే ఇతర ప్రత్యామ్నాయ మార్గాలు సిద్ధం చేసుకోవాలన్నారు. ముందుగానే బాధిత గ్రామాల ప్రజలకు ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించిన రేషన్ సరుకులను పంపిణీ చేయాలని, ప్రతి పునరావాస కేంద్రం వద్ద ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే వరదలకు సంబంధించి ప్రజలను అప్రమత్తం చేసేవిధంగా పత్రికా ప్రకటనలను జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ పీవో, సబ్‌కలెక్టర్ వంటి అధికారులు ఎప్పటికప్పుడు విడుదల చేయాలని కలెక్టర్ సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు, ఆశ్రమ పాఠశాలలకు సంబంధించిన సరుకులను ముందస్తుగానే సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట, రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య, చింతూరు ఏఎస్పీ మహేంద్రరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తుప్పల మధ్య థింసా కళావేదిక

» గత ప్రభుత్వ హయాంలో పర్యాటక రంగంపై నిర్లక్ష్యం
» ప్రత్యేక అంశం లేకపోవడంతో అరకు పర్యాటకుల నిరాశ
» పునరుద్ధరించాలని కోరుతున్న టూరిస్టులు



ప్రదర్శనలు లేక నిరుపయోగంగా మారిన కళా వేదిక



పిచ్చి మొక్కలతో నిండిన కళావేదిక ప్రాంగణం

అరకులోయ, జూలై 11 : పర్యవేక్షణ కొరవడడం, నిర్వహణ లోపం కారణంగా లక్షలాది రూపాయలతో నిర్మించిన థింసా కళావేదిక ప్రస్తుతం పిచ్చి మొక్కలతో నిండిపోయింది. అరకులోయలోని హరితవేలీ రిసార్ట్స్ ప్రాంగణంలో డ్రైవ్ ఇన్ రెస్టారెంట్ పక్కనే థింసా కళాకారులకు వేదిక, పర్యాటకులు కూర్చొని తిలకించేందుకు సిమెంట్ దిమ్మెలను ఏర్పాటు చేశారు. ఈ వేదికపై ప్రత్యేకంగా థింసా కళాకారుల బృందం ప్రతీ రోజూ రైల్ కం రోడ్ సర్వీస్‌లో వచ్చే పర్యాటకులు చూసేందుకు, మధ్యాహ్నం రిసార్ట్‌లో భోజన అనంతరం ఓ గంట పాటు ప్రదర్శనలు ఉండేవి. ఈ వేదిక థింసా కళాకారులకు ఎంతో సౌకర్యంగా ఉండేది. అదే సమయంలో పర్యాటకులు ఈ ప్రదర్శనలను చూసి బాగా ఆస్వాదించేవారు.

గత ఐదేళ్లలో నిర్లక్ష్యం

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు పర్యాటక శాఖపై నిర్లక్ష్యం వహించడం, రైల్ కం రోడ్ ప్యాకేజీ పెద్దగా నిర్వహించకపోవడంతో థింసా కళాకారులకు ఉపాధి లేకుండా పోయింది. థింసా కళాకారులు ప్రదర్శన ఇచ్చే వేదిక ఉపయోగించకపోవడం, పర్యాటక సంస్థ ప్రాంగణంలో ఉన్న వేదికను పట్టించుకోకపోవడంతో ఆవరణ అంతా పిచ్చిమొక్కలతో నిండిపోయింది. ప్రతిరోజూ థింసా నృత్య ప్రదర్శన ఉండే విధంగా సంస్థ తగిన చర్యలు తీసుకోలేదు. టూరిజం రిసార్ట్‌లో బస చేసే పర్యాటకులకు థింసా నృత్య ప్రదర్శన చూసే అవకాశం కూడా లేకుండా పోయింది.

రాష్ట్రంలో ప్రభుత్వం మారిన నేపథ్యంలో పర్యాటక శాఖపై ప్రత్యేక దృష్టి సారించాలని థింసా నృత్య కారులు, పర్యాటకులు కోరుతున్నారు. అరకు పర్యటన అంటే థింసాకు ఎనలేని ప్రాధాన్యం ఉందని, అలాంటిది ఇక్కడ ఆ నృత్యం లేకుండా ఉండడం తగదని అంటున్నారు. ఇప్పటికైనా థింసా కళా వేదిక పునరుద్ధరణకు చర్యలు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. అలాగే నృత్యకళాకారులకు అవసరమయ్యే డ్రెస్సింగ్ రూమ్, మరుగుదొడ్లు వంటి వసతులు కల్పించాలని కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ లీలాపావని

చింతపల్లి, జూలై 11 : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒకరు మొక్కలు నాటాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కె.లీలాపావని అన్నారు. గురువారం కళాశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులు 250 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూతాపం వల్ల వాతావరణంలో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. సకాలంలో వర్షాలు పడడం లేదన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రజలందరూ మొక్కలు పెంచాలన్నారు. అడవులను సంరక్షించాలన్నారు. విద్యార్థులు గ్రామాలకు వెళ్లిన సమయంలో తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్థులకు చెట్ల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వి.రమణ, కె.సంతోషి, రవీంద్రనాయక్, జగదీశ్‌బాబు, బాలరాజు, ఈశ్వరరావు, టి.జగత్‌రాయ్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు అరకు క్రీడా పాఠశాల విద్యార్థులు



ప్రిన్సిపాల్ పీఎస్ఎన్ మూర్తితో క్రీడాకారులు

అరకులోయ, జూలై 11 : పశ్చిమ గోదావరి జిల్లాలోని తణుకులో జరగనున్న రాష్ట్ర స్థాయి బాడ్మింటన్ పోటీల ఎంపికకు తమ విద్యార్థులు వెళుతున్నట్టు అరకులోయ గురుకుల క్రీడా పాఠశాల ప్రిన్సిపాల్ పీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఈ నెల 12 నుంచి 14 వరకు తణుకులోని చిట్టూరి సుబ్బారావు సత్యరాణి ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి టోర్నమెంట్స్ నిర్వహిస్తున్నారని తెలిపారు. జిల్లా స్థాయి టోర్నమెంట్‌లో విజేతలైన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. ఈ జిల్లా స్థాయి పోటీల్లో అండర్-11 విభాగంలో బియస్వంత్, కె.దేవరాజు, రాజురితీస్, వి.యువరాజు, అండర్-13 విభాగం నుంచి బి.శశిధర్‌రెడ్డి, ఎస్.సాన్విత్ తేజ, అండర్-15 విభాగంలో పి.చంద్రశేఖర్, పి.మహేందర్‌దాస్ పాల్గొననున్నట్టుతెలిపారు. వీరి వెంట బాడ్మింటన్ కోచ్ కె.రాజుబాబు ఉంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రిన్సిపాల్ మూర్తి అభినందనలు తెలిపారు.

బాబు వరాలు

... 5వ పేజీ తరువాయి

ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, సుందరపు విజయకుమార్, పంచకర్ల రమేశ్ బాబు, బండారు సత్యనారాయణమూర్తి, కేఎస్ఎన్ రాజు తదితరులు ఘన స్వాగతం పలికారు. ముందుగా ముఖ్యమంత్రిని హోం మంత్రి అనిత గజమాలతో సత్కరించారు. హెలిప్యాడ్ నుంచి అక్కిడెక్కు వరకు చంద్రబాబుకు దారి పొడవునా అధిక సంఖ్యలో మహిళలు పూలవర్షం కురిపించారు.

మాడుగుల, చోడవరం మధ్య సెజ్

మాడుగుల, చోడవరం మధ్యన సెజ్ ఒకటి తీసుకువస్తామని, అందుకు అవసరమైన భూములు పరిశీలించాలని అనకాపల్లి జిల్లా అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. గురువారం రాత్రి ఎయిర్‌పోర్టులోని లాంజ్‌లో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ అభివృద్ధి చేస్తే సంపద పెరుగుతుందని, ఆ సంపదతో సంక్షేమం అందించేలా పాలన ఉండాలని అభిప్రాయపడ్డారు. రైట్‌మెన్‌ను రైట్ ప్లేస్‌లో పెట్టడంపై దృష్టి సారించామని తెలిపారు. రైల్వే జోన్‌కు అవసరమైన భూమి విషయంలో వివాదం ఉందని, వారికి ఆమోదయోగ్యమైన స్థలం ఇచ్చి పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయిని పూర్తిగా నిర్మూలిస్తామని, ఈ విషయంలో పోలీసులు ఉక్కుపాదం మోపాలని చంద్రబాబు ఆదేశించారు.

'లులు' ప్రతినిధులతో చర్చిస్తాం

గతంలో తమ ప్రభుత్వ హయాంలో అనుమతులు మంజూరుచేసిన లులు మాల్‌ను ఆర్కే బీచ్‌రోడ్డులో ఏర్పాటుచేసేందుకు ప్రయత్నిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఆ సంస్థ ప్రతినిధులతో చర్చిస్తామన్నారు. అదేవిధంగా గాజువాకలో హిందుస్థాన్ జింక్ కర్మాగారం ప్రాంతంలో బిజినెస్ సెంటర్ ఏర్పాటుకు గతంలోనే వేదాంత సంస్థతో ఒప్పందం జరిగిందని, అయితే వైసీపీ ప్రభుత్వం దానిని పూర్తిగా పక్కనపెట్టేసిందన్నారు. దానిని తిరిగి పట్టాలెక్కించేందుకు చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి తెలిపారు.

సోలార్ ప్లాంట్ సామగ్రి చోరీపై చర్యలేవి?

మండల సమావేశంలో నిలదీసిన దేవరాపల్లి సర్పంచ్ బుజ్జిబాబు తదితరులు



సభ్యులకు సమాధానం ఇస్తున్న ఏఈఈ ప్రభాకరరావు

గూడెంకొత్తవీధి, జూలై 11 : గిరిజన గ్రామాల్లో గతంలో విద్యుత్ సదుపాయం కోసం ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్లలో సామగ్రి చోరీకి గురైనా ఈపీడీసీఎల్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని దేవరాపల్లి సర్పంచ్ సిరిబాల బుజ్జిబాబు ప్రశ్నించారు. సోలార్ ప్లేట్లు, బ్యాటరీల మాయం వెనుక కొంత మంది వైసీపీ పెద్దల హస్తం ఉన్నట్టు ప్రచారం జరుగుతోందని ఆయన ఆరోపించారు. గురువారం ఎంపీపీ బోయిన కుమారి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు.. తొలుత వివిధ ప్రభుత్వశాఖల అధికారులు అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సభ్యులకు వివరించారు. విద్యుత్‌శాఖపై చర్చ రాగా బుజ్జిబాబు సోలార్ ప్లాంట్ల విషయమై నిలదీశారు. దీనిపై మూడు నెలల కిందట ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించలేదన్నారు. దీనిపై ఏఈఈ ప్రభాకరరావు సమాధానం ఇస్తూ సోలార్ ప్లేట్లు, బ్యాటరీలు చోరీకి గురవడం వాస్తమేనన్నారు. జీకేవీధి పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఎస్ఐ అప్పలసూరి సమాధానమిస్తూ ఈ విషయం ఏఎస్పీ దృష్టిలో పెట్టామని, పురోగతి సాధిస్తామని తెలిపారు. గాలికొండ ఎంపీటీసీ సభ్యుడు అపురంగి బుజ్జిబాబు కలుగజేసుకుని 15 రోజుల్లో సోలార్ ప్లాంట్ సామగ్రి దొంగలపై చర్యలు తీసుకోవాలని, లేదంటే కలెక్టర్‌కి ఫిర్యాదు చేస్తామన్నారు. జీసీసీ ద్వారా నిత్యావసర సరకులు సక్రమంగా పంపిణీ చేయడంలేదని, శివారు గ్రామాల్లో పాఠశాలలకు భవనాలులేవని గాలికొండ ఎంపీటీసీ సభ్యుడు ప్రస్తావించారు. జీకేవీధి ఎంపీటీసీ సభ్యురాలు రీమల రాజేశ్వరి మాట్లాడుతూ గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలల్లో మెనూ సక్రమంగా అమలు కావడం లేదన్నారు. దీనికి ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి స్పందిస్తూ వసతి గృహం డిప్యూటీ వార్డెన్లు, హెచ్‌డబ్ల్యూవోలో సమావేశం ఏర్పాటు చేసి కచ్చితమైన ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ధారకొండ వైద్యాధికారి డీకే హిమబిందు సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, జడ్పీటీసీ సభ్యురాలు శివరత్నం, వైఎస్ ఎంపీపీలు ఆనంద్, దేవుడు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

» ఎంఈవో ప్రసాద్



విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఎంఈవో ప్రసాద్

చింతపల్లి, జూలై 11 : ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు విధిగా సమయపాలన పాటించాలని మండల విద్యాశాఖ అధికారి పనసల ప్రసాద్ అన్నారు. గురువారం మండలంలో శివారు కిటుముల పంచాయతీ పొలంబంద ఎంపీపీ పాఠశాలను ఎంఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. కిటుముల పంచాయతీ కేంద్రం నుంచి పొలంబంద వరకు ఐదు కిలోమీటర్లు కాలినడకన ప్రయాణించి ఎంఈవో పాఠశాలకు వెళ్లారు. తొలుత పాఠశాలలో విద్యార్థుల విద్యా ప్రగతి, మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. విద్యార్థుల భోజనాలను ఆయన స్వయంగా రుచి చూశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థుల అన్ని అంశాల్లో పట్టు సాధించేలా ఉపాధ్యాయులు బోధన చేయాలన్నారు. మెనూ ఆధారంగా విద్యార్థులకు భోజనాలు పెట్టాలన్నారు. ప్రతి రోజు భోజనాలను ఉపాధ్యాయులు పరిశీలించి రుచి చూడాలన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో విధిగా మెనూ పాటించాలి

» తహసీల్దార్ రామకృష్ణ



వంటల రుచి చూస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

చింతపల్లి, జూలై 11 : గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలల్లో విధిగా మెనూ పాటించాలని స్థానిక తహసీల్దార్ టి.రామకృష్ణ అన్నారు. గురువారం తహసీల్దార్ వంగసార బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. తొలుత తొమ్మిది, పది విద్యార్థుల విద్యా ప్రగతి తనిఖీ చేశారు. విద్యార్థులకు పెడుతున్న భోజనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ విద్యార్థినులు తెలుగులోనూ వెనుకబడి ఉన్నారన్నారు. విద్యార్థినులు స్పష్టంగా చదవడం, రాయడం చేయలేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థినులు తెలుగు, ఆంగ్లం, గణితంలో పట్టు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. వెనుకబడి వున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వారిలో ఏవైనా అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తీసుకొని వెళ్లి చికిత్స అందించాలన్నారు. మెనూ ఉల్లంఘిస్తే కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళతామని హెచ్చరించారు. వసతిగృహం పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు.

ఫ్లెక్సీ ధ్వంసంపై టీడీపీ నేత ఫిర్యాదు

కొయ్యూరు, జూలై 11 : మండలంలో బాలారం గ్రామ పంచాయతీ భవన ఆవరణలో టీడీపీకి చెందిన ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడం చర్చనీయాంశమైంది. కూటమి అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలను తెలియ చేసే ఈ ఫ్లెక్సీని దివంగత మాజీ సర్పంచ్ అప్పన శ్రీరాములు ఫొటోతో పాటు మండల టీడీపీ కార్యదర్శి బి.లక్ష్మణ్ ఫొటోలతో ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీ ధ్వంసం చేయడంపై టీడీపీ మండల కార్యదర్శి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పీహెచ్‌సీల ప్రతిపాదన పట్టాలెక్కేనా..?

... 5వ పేజీ తరువాయి

గిరిజనులకు మేలు జరుగుతుంది. కానీ వైసీపీ ప్రభుత్వం కొత్త పీహెచ్‌సీల ఏర్పాటు ప్రతిపాదనలపై కనీసం స్పందించలేదు.

కూటమి ప్రభుత్వంపైనే గిరిజనుల ఆశలు

కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం తమ ప్రాంతంలో కొత్త పీహెచ్‌సీల ఏర్పాటునకు సానుకూలంగా చర్యలు చేపడుతుందని గిరిజనులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఏజెన్సీలో రోడ్డు, రవాణా సదుపాయాలు సంపూర్ణంగా లేకపోవడంతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సైతం దూరంగా ఉండడంతో మారుమూల ప్రాంత వాసులు వైద్య సేవలకు నోచుకోని దుస్థితి కొనసాగుతున్నది.

ఈ తరుణంలో కొత్త పీహెచ్‌సీల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం చొరవ చూపితే తమకు న్యాయం జరుగుతుందని మారుమూల ప్రాంత గిరిజనులు అభిప్రాయపడుతున్నారు.

జి.మాడుగులలో కలెక్టర్ సుడిగాలి పర్యటన

... 5వ పేజీ తరువాయి



జి.మాడుగుల పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

ఆదేశించారు. బొయితిలి ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో పాఠ్యపుస్తకాలు చదివించారు. అక్కడ జరుగుతున్న భవన నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేస్తామని, ఆయ పనులను వేగవంతం చేయాలని ఇంజినీర్ అధికారులకు ఆదేశించారు. మద్దిగరువు వారపు సంతలో దుకాణాల్లోని వస్తువుల నాణ్యతను పరిశీలించారు.

అనంతరం మారుమూల కిల్లంకోట పంచాయతీలోని కోడిమామిడి వంతెన, రహదారి పనులను పరిశీలించారు. కిల్లంకోట గ్రామంలోని గ్రామస్థులు ఆధార్, కార్డులు, రేషన్ కార్డులు లేవని కలెక్టర్‌కి విన్నవించారు. ఆధార్, రేషన్ కార్డులు, అంగన్‌వాడీ భవనం నిర్మాణానికి హామీ ఇచ్చారు. అంతకుముందు తొలిసారిగా పంచాయతీకి వచ్చిన కలెక్టర్ దినేశ్‌కుమార్‌ను మహిళలు పూలమాలలతో ఘనంగా స్వాగతం పలికారు.

ఈ కార్యక్రమంలో డీఈవో బ్రహ్మాజీరావు, ఎంపీడీవో లోహిత్ జయసాగర్, ఏటీడబ్ల్యూవో తిరుపాల్, ఎంఈవో బాబురావుపడాల్, ఇంజినీర్ అధికారులు మాణిక్యం, విజయ్‌కుమార్, సర్పంచులు రాంబాబు, సూరిబాబు, మాలన్న, అధికారులు పాల్గొన్నారు.

☛ సంక్షిప్తంగా..

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదబయలు, జూలై 11 : అల్లూరి జిల్లాలోని పెదబయలు, ముంచంగిపుట్టు, హుకుంపేట మండలాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏవీఏఎం అప్పారావు తెలిపారు. పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలతో పాటు హుకుంపేట మండలంలోని బాకూరు, అడ్డుమండ గ్రామాలకు సరఫరా నిలిపివేస్తున్నట్టు వెల్లడించారు.

నేడు ఏపీజీఈఏ ఎన్నిక

చింతపల్లి, జూలై 11 : మండల కేంద్రంలో చింతపల్లి తాలూక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ (ఏపీజీఈఏ) నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం నిర్వహించనున్నట్టు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ రమణ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తాలూక నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించేందుకు జిల్లా కమిటీ నిర్ణయించిందన్నారు. ఏపీజీఈఏ సభ్యులందరు సబ్ ట్రెజరీ కార్యాలయానికి హాజరు కావాలన్నారు.

పత్రికా కార్యాలయంపై దాడి తగదు

పాడేరురూరల్, జూలై 11 : విశాఖపట్నంలోని డెక్కన్ క్రానికల్‌పై దాడిని గిరిజన సంఘం ఖండిస్తోందని ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స అన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా కథనాలు రాశారనే ఉద్దేశంతో టీడీపీ విద్యార్థి విభాగం, కార్యకర్తలు దాడి చేయడాన్ని ప్రతీ ఒక్కరూ ఖండించాలన్నారు. పత్రికా కార్యాలయాలపై రాళ్లు రువ్వడం, సంస్థ బోర్డును తగులబెట్టి దాడులకు పాల్పడటం పత్రికా స్వేచ్ఛను కాలరాయడమే అన్నారు.

ఘనంగా భారతీయ ఆంగ్లేయ రచయితల జయంతి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చిట్టబ్బాయి

పాడేరు రూరల్, జూలై 11 : అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో గురువారం భారతీయ ఆంగ్లేయ రచయితలు జంపాల హరి, అమితాప్ గోష్‌ల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వనుము చిట్టబ్బాయి, ఇంగ్లీష విభాగాధిపతి పి.కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు ఆంగ్ల రచయితల స్టోరీలను క్షుణ్ణంగా అభ్యసించి అవగాహన చేసుకోవాలన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ఇప్పటి నుంచే చిన్న చిన్న కథలను రాయటం అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ప్రిన్సిపాల్ టీఎన్ రసూల్, అధ్యాపకులు వి.రమేష్‌బాబు, జి.భాస్కరరావు, కె.నిర్మళ, జి.గౌరీశంకరరావు, సీహెచ్.అచ్యుత్, పి.సౌజన్య, పి.సుమిత్ర, యువరాజ్, శంకరరావు, గోవిందరాజు పాల్గొన్నారు.

పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్ఎం కాంతారావు

చింతపల్లి, జూలై 11 : విద్యార్థుల విద్యా ప్రగతిపై తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరమని చౌడుపల్లి ఎంపీయూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుడుముల కాంతారావు అన్నారు. గురువారం పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు విద్య రాణించేందుకు ఉపాధ్యాయులతో పాటూ తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. పాఠశాలకు ప్రతి విద్యార్థిని క్రమంగా పంపించాలన్నారు. ఈ సమావేశంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీడీపీతోనే గిరిజన గ్రామాల అభివృద్ధి



మాట్లాడుతున్న సర్పంచ్ అర్జున్

డుంబ్రిగుడ, జూలై 11 : టీడీపీ హయాంలోనే గిరిజన గ్రామాల అభివృద్ధి సాధ్యమని కొర్రా సర్పంచ్ లకే అర్జున్ అన్నారు. మండలంలోని కొర్రా పంచాయతీ కేంద్రంలో సర్పంచ్ అధ్యర్యంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ పరిధిలో ఉన్న ఆయా గ్రామాల సమస్యలను గ్రామ సభలో చర్చించారు. అనంతరం సర్పంచ్ అర్జున్ మాట్లాడుతూ గత ప్రభుత్వం హయంలో పంచాయతీలకు నిధులు లేక ఇబ్బందులు పడ్డామన్నారు. కూటమి ప్రభుత్వం రావడంతో గిరిజన గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ, కార్యదర్శి, వార్డుమెంబర్లు, టీడీపీ నేతలు, ట్రైడ్స్ ఎన్‌జీవోలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో అందుబాటులోకి ఆల్ట్రా సౌండ్ స్కానింగ్

ముంచంగిపుట్టు, జూలై 11 : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు నిర్వహించే ఆల్ట్రా సౌండ్ వైద్య పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. గురువారం పలువురు గర్భిణులకు సీహెచ్‌సీలో ఆల్ట్రా సౌండ్ స్కానింగ్ వైద్య పరీక్షలను చేశారు. సీహెచ్‌సీలో గత కొంత కాలంలో ఆల్ట్రాసౌండ్ స్కానింగ్ వైద్య పరీక్షలు చేపట్టడంలేదని మండల ప్రజలు ఫిర్యాదులు చేయడంతో ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్, పీవోల దృష్టికి టీడీపీ డివిజన్ నేత పి.పాండురంగస్వామి తీసుకువెళ్లారు. దీంతో స్పందించిన అధికారులు ఆల్ట్రా సౌండ్ స్కానింగ్ జరిగే విధంగా తగు ఏర్పాట్లు చేశారు. ఇక నుంచి ప్రతీ గురువారం సీహెచ్‌సీలో ఆ స్కానింగ్ తీయడం జరుగుతుందని వైద్యులు తెలియజేశారు.